క్లుప్తంగా

పూడికతీత పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న గోల్నాక కార్పొరేటర్ లావణ్య

కాచిగూడ: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా కచ్చామోరీల్లో పూడికతీత పనులను చేపట్టినట్లు గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం డివిజన్‌లోని కృష్ణానగర్ బస్తీలో జీహెచ్ఎంసీ సిబ్బంది, అధికారులతో కలిసి ఆమె పూడికతీత పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు డివిజన్‌లో సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు.

బీసీ సీఎం పార్టీ అభ్యర్థికే మద్దతు

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎంగా బీసీ అభ్యర్థిని ప్రకటించిన పార్టీకే బీసీల మద్దతు ఉంటుందని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఆరోపించారు. బీసీలకు రాజ్యాధికారంలో వాటా దక్కకుండా చేస్తున్నాయని ఓ ప్రకటనలో తెలిపారు. బీసీలను విస్మరించే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించి ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలంతా సంఘటితమై రాజ్యాధికారం దిశగా ఉద్యమించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం'



కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పూర్తి స్థాయిలో విజయం సాధించి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి ధీమా వ్యక్తం చేశారు. శనివారం గోల్నాకలో బీజేపీ గుర్తు కమలంతో 'తెలంగాణలో బీజేపీ సర్కార్ అనే స్లోగన్స్'ను గోడలపై ఆమె వ్రాశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవినీతిలో కూరుకుపోయి కుటుంబ పాలన చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కేంద్రం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

29న చలో లేబర్ కమిషనర్ ఆఫీస్



మాట్లాడుతున్న యాటల సోమన్న

చిక్కడపల్లి: హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న 'చలో లేబర్ కమిషనర్ ఆఫీస్' పేరిట ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యాటల సోమన్న పిలుపునిచ్చారు. శనివారం హమాలీ వర్కర్స్ యూనియన్ నేత శ్రవణ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ.. హమాలీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల మంది హమాలీలు పనిచేస్తున్నారని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కృషి చేయాలని కమిషనర్‌ను డిమాండ్ చేశారు. నరసింహ, గోపాల్, వెంకటేష్, చిన్న, ఆంజనేయులు, రామకృష్ణ, మల్లేష్ తదితరులున్నారు.

మురుగు.. పరుగు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని స్విమ్మింగ్‌పూల్ రోడ్డులో మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు పారుతోంది. నెల రోజులుగా మురుగు నీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ మార్గం మీదుగా వెళ్లాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు.



సయ్యద్ బత్తియార్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ముస్లిం మతపెద్దలతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఘనంగా రంజాన్ వేడుకలు

ముషీరాబాద్/అంబర్‌పేట్ జోన్ పరిధిలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం చిన్నా పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. శాంతియుత వాతావరణంలో పండుగలను నిర్వహించుకోవాలని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేల సహా వివిధ పార్టీల నేతలు ఇళ్లకు వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

– అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ బృందం



హోంశాఖ మంత్రి మహమూద్ అలీతో రాంనగర్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి



అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో సామూహిక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్



బీజేపీ నేత ఎండీ మహమూద్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్



అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో సామూహిక ప్రార్థనల్లో మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు



మాజీ మంత్రి కృష్ణయాదవ్ తదితరులు



మంత్రి మహమూద్ అలీతో బీఆర్ఎస్ నేత సునిల్ బిడ్లాన్

నిమ్స్ ఆసుపత్రిలో అక్రమాలపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తాం

కవాడిగూడ: నిమ్స్ ఆసుపత్రిలో అక్రమాలకు పాల్పడుతున్న అడ్మినిస్ట్రేషన్‌పై చర్యలు తీసుకోవాలని బీసీ నాయకుల డిమాండ్‌పై వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు స్పందించి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నిమ్స్ ఆసుపత్రిలో అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కేవీ కృష్ణారెడ్డి రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తానని రోగుల వద్ద నుంచి డబ్బులు దండుకుని ఎలాంటి వైద్యం చేయకుండా పేషెంట్‌లను తిరిగి పంపిస్తున్నారని' ఆరోపిస్తూ.. మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి మెడికల్ కౌన్సిల్ చైర్మన్ వి.రామలింగంకు లేఖ ద్వారా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. వైద్యం కోసం వచ్చే బాధితులను ఇబ్బందులకు గురిచేస్తే ఊపేక్షించేది లేదని స్పష్టం చేశారన్నారు.



మంత్రి హరీష్‌రావుతో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొమ్మరాజు కృష్ణమూర్తి

కవాడిగూడ: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి తక్షణమే నివేదిక పంపించాలని తెలంగాణ రజక (దోభీ) అభివృద్ధి సంస్థ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ బొమ్మరాజు కృష్ణమూర్తి, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం.నర్సింహులు డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని సంస్థ కార్యాలయంలో రజక అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సమావేశం గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం.నర్సింహ రజక అధ్యక్షతన నిర్వహించగా.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా శ్రీరాములు, జూపల్లి రాజశేఖర్, వెంకటేష్, నర్సింగ్‌రావు, చుక్కన్నలు హాజరయ్యారు.

- సీఎం కేసీఆర్ రజకులకు ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేసి రజక వృత్తి చేసుకుంటున్న రజకులకు రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.
- ఇతర కులస్తులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్, హెల్త్‌కార్డులతో పాటు 50 ఏళ్లు నిండిన రజక వృత్తిని నమ్ముకున్న వారికి పెన్షన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం..

గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్‌గా నర్సింహ, ప్రధాన కార్యదర్శులుగా చంద్రమోహన్, మహిళా చైర్మన్‌గా సునంద, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మి, వైస్ చైర్మన్‌గా వాణి, కార్యదర్శిగా ఎం.శ్రీలత, యువసేన గ్రేటర్ చైర్మన్‌గా ఎన్.ధన్‌రాజ్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, శ్రీరాములు, రాములు, సత్యనారాయణతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



డాక్టర్ శ్రీనివాస్ గంగాధరిని సన్మానిస్తున్న దృశ్యం

కవాడిగూడ: ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ శ్రీనివాస్ గంగాధరికి మెగాసిటీ నవ కళావేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డును తెలంగాణ ప్రభుత్వ విప్ భానుప్రసాదరావు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను అతిథులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపిక కావడం తనకు సంతోషంగా ఉందని అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పాటుపడతానన్నారు. తనకు అవార్డు రావడంతో మరింత బాధ్యతను పెంచిందన్నారు. దైవజ్ఞశర్మ, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాణికేశ్వర్‌నగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించండి

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌బస్తీలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆస్పత్రి నిర్మించాలంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 18వ రోజుకు చేరుకున్నాయి. మాణికేశ్వర్‌నగర్ వాసులు చేస్తున్న ఈ దీక్షలకు డీబీఎఫ్ నాయకులు కల్పనతో పాటు శంకర్, కాశీనాథ్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు పాల్గొన్నారు.

మెదక్ బిషప్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఉస్మానియా యూనివర్సిటీ: దళితులను కించపరిచేలా వ్యాఖ్యానించిన బిషప్ పద్మారావుపై ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్(అంసా), తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో బిషప్ పద్మారావుపై ఎస్సీ, ఎస్టీ అట్రసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రామ్‌కోఠిలోని సీఎస్ఐ చర్చిలో మెదక్ డయోసిస్ బిషప్ పద్మారావు గత నెల 5న ఆదివారం మాల, మాదిగలను కించపరుస్తూ ప్రసంగించిన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంసా నాయకులు గాజుల ప్రభాకర్, రాహుల్, రవిందర్, నాగరాజు, లక్ష్మీనారాయణ, జయప్రకాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'మినర్వా' రోడ్డు నిర్మాణం వివాదాస్పదం

హిమాయత్‌నగర్: హోటల్ మినర్వా కేఫ్ లైన్‌లో చేపట్టిన రోడ్డు నిర్మాణం వివాదాస్పదంగా తయారైంది. నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టడంతో జలమండలికి చెందిన పైప్‌లైన్ పగిలింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్ శనివారం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించగా అతను రాజకీయ నాయకుల పేర్లు చెబుతున్నాడంటూ కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్ ఆరోపించారు. విషయం తెలిసి అక్కడకు వచ్చిన ఈఈ పేర్రాజు ఆయా పనులను పరిశీలించారు. త్వరతిగతిన పనులు అయ్యేలా చూస్తానన్నారు. మినర్వా హోటల్ వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో హోటల్ డైరెక్టర్ కృష్ణమనోహర్‌రెడ్డి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన జెడ్‌సీ మాట్లాడుతూ... కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గడువులోగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయకపోతే కాంట్రాక్టర్‌ను మారుస్తామన్నారు.

'కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై అవిశ్రాంతపోరు'

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా.. బీసీ వ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటం చేస్తామని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి అన్నారు. మిషన్ 2024 లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ఢిల్లీ స్థాయిలో పోరాటాలు సాగిస్తామన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఇప్పటి వరకు 'ఓట్లు మావి అధికారం మాది' అని బీజేపీ మాట ఇకపై చెల్లదని స్పష్టం చేశారు. 70 కోట్ల మంది బీసీ ఓట్లతో గద్దెనెక్కిన కేంద్ర ప్రభుత్వం అనంతరం వారిని విస్మరించడం ఎంత వరకు సమంజసమన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీసీలను సంఘటితం చేసి ఐక్య పోరాటాలు సాగిస్తామన్నారు. అనంతరం ఢిల్లీ కేంద్రంగా బీసీ ఉద్యమాలు, ప్రతిఘటన పోరాటాలు ఉంటాయని తెలిపారు.

వైభవంగా అష్టలక్ష్మీ ఆలయ బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయ 27వ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 2వ రోజైన శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా మూర్తి కుంభస్థాపన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణ, బేరిపూజ, దేవతాహ్వానం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు వేద మంత్రోచ్చరణల మధ్య అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య శేష వాహన సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న లోప్రెషర్ నీటి సరఫరా సమస్య

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ ప్రజలకు ఇక నుంచి తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్య పరిష్కారం అవుతుందని డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం కార్పొరేటర్ కార్యాలయంలో బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్‌తో కలిసి ఆమె మాట్లాడారు. గత కొన్నేళ్లుగా డివిజన్ ప్రజలు తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. రూ.13.75 లక్షలతో నూతన తాగునీటి పైప్‌లైన్‌తో పాటు నూతన టి.జంక్షన్ నిర్మాణ పనులకు ఈ నెల 24న ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మాజీ జలమండలి డీజీఎం చంద్రశేఖర్, మేనేజర్ వేణుగోపాల్‌తో కలిసి లోప్రెషర్ నీటి సరఫరా సమస్యపై సమీక్షలు నిర్వహించామన్నారు. డివిజన్ పరిధిలోని ఎల్లయ్యబస్తీలో నూతన సేవరేజ్‌లైన్ పనులు రూ.2 లక్షలతో ప్రారంభిస్తామన్నారు.

నేడు 'జై భీమ్ ప్రజా సేవ సమితి' ఆవిర్భావం

కాచిగూడ: 'జై భీమ్ ప్రజా సేవా సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కాచిగూడలోని చెప్పల్‌బజార్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనాథ్ ప్రకటించారు. శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా పనిచేస్తూ.. వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు తమ వంతు కృషి చేయనున్నట్లు వివరించారు. బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకల సందర్భంగా 'జై భీమ్ ప్రజాసేవ సమితి'ని ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తదితరులు హాజరవుతారని సమాచారం.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన షబ్బీర్ అహ్మద్ కుమారుడు ఇసాక్ అహ్మద్ (32) చెప్పుల షాపులో పనిచేస్తుంటాడు. శివరాంపల్లి – బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.